క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి చర్యలు



వెంకటాపురంలో అధికారులతో కలిసి రహదారిని పరిశీలిస్తున్న భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఇక్కడి పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద రోడ్డు వేసేందుకు సర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయలతో పాటు గోపాలపట్నం ఆర్ఐ సురేష్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, సర్వేయర్ జగదీష్, జీవీఎంసీ సర్వేయర్ అప్పన్న, వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు గొంతెన నాగరాజు, ఉప్పిలి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో చిన్నారుల ప్రతిభ



బాక్సింగ్‌లో పతకాలు సాధించిన మైక్ టైసన్ బాక్సింగ్ సొసైటీ చిన్నారులు

మల్కాపురం: ఇటీవల నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన మైక్ టైసన్ బాక్సిగ్ సొసైటీ క్లబ్ క్రీడాకారులు ప్రతిభ చూపారు. వాసుదేవ్ బంగారు పతకం సాధించగా హర్షిత బ్రాంజ్, కల్పిత సిల్వర్ మెడల్స్ సాధించారు. క్లబ్ నిర్వాహకులు బుధవారం శ్రీహరిపురం మైదానం వద్ద పతకాలు సాధించిన చిన్నారులతో పాటు కోచ్‌ను అభినందించారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదాలు వడ్డిస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్ నగర్ ఏడుగుడుల సెంటర్ వద్ద కొలువుదీరిన పెంటామాంబ,దుర్గమాంబ,పోలమాంబ ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మల్కాపురం గ్రామం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం అన్న సమారాధనను ప్రారంభించారు. పరిసర గ్రామాల భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు బాగు చేయరూ!



బాజీ జంక్షన్ నుంచి పాతగోపాలపట్నం వెళ్లే దారిలో పాడైన రోడ్డు

గోపాలపట్నం: బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లే రహదారిలో కళ్లు పాకల వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుంటున్నాయి. వర్షం పడితే గొయ్యిల్లో నీరు చేరి ఇబ్బందులు గురి చేస్తోంది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్జక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

గొందేశివానిపాలెంలో ఉద్రిక్తత

- తమ స్థలంలో ఇల్లుకట్టనివ్వడం లేదని ఆరోపణ
- టెన్షన్‌తో కృష్ణ మృతిచెందాడని కుటుంబ సభ్యుల ఆందోళన
- చక్కదిద్దిన గాజువాక పోలీసులు



మృతుడు కొన్న స్థలంలో దహనం చేసేందుకు పేర్చిన కట్టెలు, ఇన్‌సెట్‌లో మృతుడు కృష్ణ (ఫైల్)



ఇంటి నిర్మాణానికి అడ్డుతగులుతున్న వ్యక్తి ఇంటి ముందు గుమిగూడిన మృతుడి బంధువులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గొందేశివానిపాలెంలో బుధవారం ఉదయం ఉద్రిక్తత పరిస్థితి నెలకుంది. ఇక్కడ నివాసం ఉంటున్న చంద్రరావు అనే వ్యక్తి ఇంటికి పదుల సంఖ్యలో జనం చేరడంతో అలజడి రేగింది. దీనిపై స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్ ప్రాంతంలో సాదుబిల్లి కృష్ణ (42) భార్య లీలా,పదో తరగతి చదువుతున్న కుమారుడు,తొమ్మిది చదువుతున్న కుమార్తెతో కలిసి కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. కృష్ణ భవన నిర్మాణ కార్మికుడిగా,గ్యాస్ డెలివరీ బాయ్‌గా కూడా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే పదేళ్ల కిందట 58వ వార్డు గొందేశివానిపాలెంలో చంద్రరావు సోదరుడి వద్ద కొంత స్థలాన్ని కృష్ణ కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి కృష్ణ సిద్ధపడగా చంద్రరావు అడ్డుకున్నాడు. అన్నదమ్ముల ఆస్తి పంపకంలో తేడా ఉందని, ఈ స్థలంలో ఇంటిని నిర్మిస్తే ఉరుకోమని గొడవకు దిగారు. కృష్ణ ఈ వ్యవహారంపై అప్పట్లో గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరలా కొద్ది రోజుల కిందట తన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్తే చంద్రరావు అడ్డుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణకు మంగళవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఊపిరి ఆడక చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కృష్ణ మృతికి చంద్రరావు కారణమంటూ అతడి బంధువులు బుధవారం చంద్రరావు ఇంటికి చేరుకున్నారు. చంద్రరావును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన స్థలంలోనే దహనం చేయడానికి కట్టెలు పేర్చారు. రంగంలోకి దిగిన గాజువాక సీఐ భాస్కరరావుసిబ్బంది సాయంతో అక్కడ గుమిగూడిన వారిని చెదరగొట్టారు. విచారణ నిమిత్తం చంద్రరావును గాజువాక స్టేషన్‌కు తీసుకువెళ్లారు.దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

సలామ్.. పోలీసన్నా..



శ్రీహరిపురం సెంటర్‌లో వద్ద మండుటెండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్



అధిక ఉష్ణోగ్రత ఉన్న కోరమాండల్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- మండుటెండలో ట్రాఫిక్ పోలీసుల విధులు
- ఎండకు ఎండుతూ కర్తవ్యం కొనసాగింపు

మల్కాపురం: భానుడి ప్రతాపానికి ఇంట్లోనే ఉండలేక పోతున్నాం. ఫ్యాన్లు.. కూలర్లు తిరిగినా ఆపసోపాలు పడుతున్నాం. ట్రాఫిక్ పోలీసులు మాత్రం మండే ఎండలో విధులు నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. నగరంలోని మిగిలిన ప్రాంతాల కంటే పారిశ్రామిక ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ప్రధాన కూడళ్లు అయిన మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్,సింధియా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు మండుటెండలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక, ఉక్కపోతకు ఉండలేక ఆసెంటర్‌లో ఉన్న ఏదైనా షాపు వద్దకు వెళ్లి కాసేపు సేద తీరుదాం అనుకుంటే ఆ సమయంలో ఏ అధికారి వస్తాడో..ఎక్కడ తమ కొలువుకు ఇబ్బంది వస్తుందనే భయంతో కష్టమైనా తమ కర్తవ్యాన్ని కొనసాగిస్తున్న ట్రాఫిక్ పోలీసుకు సలామ్ చెప్పాలి. ట్రాఫిక్ పోలీసులు కష్టాలను ఉన్నతాధికారులు గుర్తించి ఆయా కూడళ్లలో నీడ సౌకర్యం కల్పిస్తారని ఆశిద్దాం.



మండుటెండలో ఎస్ఐ సైతం..

అమ్మోనియా లీకేజీ కట్టడిపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కర్మాగార శాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ,కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పరిశ్రమల నుంచి అమ్మోనియా లీక్ అయితే ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి.. లీకేజీను ఎలా నియంత్రించాలన్న దానిపై అవగాహన సదస్సు ద్వారా జిల్లా డిప్యూటీ కలెక్టర్ (స్పెషల్), కర్మాగారాల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ రెడ్డి వివరించారు. సీఐ సురేష్‌బాబు, కర్మాగారాల ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ములగాడ మండల తహసీల్దార్ డి.వీరభద్రరావు, కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ సుందరం ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, కోరమాండల్ అధికారులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



చిన్నారులకు పౌష్టికాహారం ఇస్తున్న కార్పొరేటర్ లావణ్య



ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ వద్ద జరిగిన శిబిరంలో పాల్గొన్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ గులిగిండల లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ వద్ద శిబిరాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ అధికారి సునీల్‌కుమార్, కోచ్ ఆనంద్‌బాబు,కుంచారావు, నాయకులు సంపత్‌కుమార్,గుడాల బాబూరావు,ఖాన్, దేవర రమేష్‌యాదవ్,అనిల్‌కుమార్,కాకి గౌరి,కాకి సరోజ పాల్గొన్నారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బీఆర్‌టీఎస్ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: పాత గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు బాధితులందరికీ న్యాయం చేస్తామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. పాత గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న బాధితులతో పాటు జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పలుపార్టీల ప్రతినిధుల సమక్షంలో 98వవార్డులోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు పడితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాగే బాధితులందరికీ ఆమోదయోగ్యమైన ప్యాకేజీ ఇవ్వడానికే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. అలాగే టీడీఆర్‌లు, ప్రత్యామ్నాయ స్థలం విషయం, కాంపొజేషన్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బాధితులు తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు, ఖాళీ స్థలాలు కోల్పోయే బాధితులందరికీ నాలుగు టీడీఆర్‌ల చొప్పున ఇవ్వాలని, ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం, ఇళ్లు కోల్పోయే బాధితులకు 150 గజాలు చొప్పున ప్రత్యామ్నాయ స్థలాన్ని అందించాలని అధికారులను కోరారు. దేవస్థానంతో సబంధం లేకుండా స్థలాన్ని తమకు అందించాలని కోరారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, జెడ్పీ మల్లయ్యనాయుడు, 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కాంద్రేగుల సూర్యనారాయణ, సమితి సభ్యులు

కంచరపాలెం: గౌరీ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాల రహదారిలో ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి కాంద్రేగుల సూర్యనారాయణ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ఉపశమనానికి బాటసారులకు నిత్యం మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ చేస్తామని సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రాపేటి అప్పారావు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి ఎ.వి.రమణ, గౌరీ కళాశాల కరస్పాండెంట్ పొలిమేర సన్యాసినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్, ప్రెసిడెంట్ డి.కె.ఎ.సత్యనారాయణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గోతులు పూడ్చండి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం సచివాలయ పరిధిలో 24/7 మంచినీటి పైపులైన్ పనులు చేపట్టారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా గోతులను సక్రమంగా పూడ్చలేదు. అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు ఆ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. పారిశుధ్య సిబ్బంది రోడ్లు ఊడ్చేటప్పుడు గోతుల్లో చెత్త చెదారాలు వేసేస్తున్నారు. సమస్యపై జీవీఎంసీ జోన్–5 అధికారులకు, సచివాలయ సబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇంటి నిర్మాణ వ్యర్థాలు గోతుల్లో వేస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చాలి.

– వై.రాజు, తోటవీధి, కంచరపాలెం



అధ్వానంగా ఉన్న గొల్ల కంచరపాలెం రహదారి

ఉక్కు ఉద్యమం మార్గదర్శకం కావాలి



832వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోమని, కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బోండా తౌడన్న అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 832వ ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలకొండ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు, కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, గణేష్, పైడి కొండలరావు, ఫణీంద్రబాబు, వేణుగోపాలరావు, మోహన్‌బాబు, పుల్లారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'సహారా' ఖాతాదారులు, ఉద్యోగులను ఆదుకోవాలి

అగనంపూడి: సహారా ఇండియా ఖాతాదారులు, ఉద్యోగులను ఆదుకోవాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు అగనంపూడికి చెందిన సహారా చీఫ్ ఫీల్డ్ మేనేజర్ కిడిమి హనుమంతురావు కోరారు. ఈ మేరకు ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. సహారా ఇండియా సంస్థ నిబంధనల ప్రకారం లావాదేవీలు సాగిస్తున్నా పదేళ్ల క్రితం సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేయడం వల్ల రూ.25వేల కోట్ల మేరకు చెల్లింపు నిలిచిపోవడంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొందని, అలాగే సంస్థలో పెట్టుబడులు పెట్టిన పది కోట్ల మంది ఖాతాదారుల జీవితాలు ముడిపడి ఉన్నాయన్నారు. అలాగే 12 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నారని, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యను పరిష్కరించి ఖాతాదారులు, ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని హనుమంతురావు కోరారు. వివిధ సంఘాల నాయకులు టి.రాము, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

28న 'ఘంటసాల జీవిత చరిత్ర' నాటకం

దాబాగార్డెన్స్: భారతదేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శ్రీభాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఆ రోజు సాయంత్రం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ నాట కం ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంట లకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని, ప్రదర్శనలకు రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు కళాభారతిలోనూ, రంగసాయి నాటక గ్రంథా లయం, సాయి బాదంగీర్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కు 94404 58458 నంబర్ లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయు డు ఎస్.నాగేశ్వరరావు, చంద్రశేఖర్, కుమార్ రాజు, చినబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రగతికి సహకరించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే కోరారు. బుధవారం హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ మిత్ర పక్షాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి, మరింత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు వేతన సవరణ చేయాలని, మెడికల్ సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఇన్సెంటివ్ పెంచాలని, కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. గతంలో ఉన్న కార్మిక సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎంలు కె.శ్రీనివాసరావు, జి.గాంధీ, జీఎంలు కె.సంజీవరావు, బినయ్ ప్రసాద్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

మద్దిపాలెం: ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు మాధవధారలోని ఎంఎస్‌ఆర్ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరావు తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ చదువుకున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 26 లోగాఎంఎస్‌ఆర్ గ్రంథాలయంలో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి.

ఉక్కు కార్మికుడి ఇంట్లో చోరీ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. రాత్రి డాబాపై నిద్రించి తెల్లవారి కిందికి దిగి చూసే సరికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించిన బాధితుడు దువ్వాడ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి దరి దొంకాడ కాలనీకి చెందిన పల్లా నానాజీరావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి డాబాపై నిద్రించేందుకు వెళ్లి తిరిగి బుధవారం ఉదయం కిందికి వచ్చే చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా పరుపు తల దగ్గర ఉన్న బాక్సులో ఉండాల్సిన 2.50 తులాల బంగారం పుస్తెలతాడు, 20 తులాలు వెండి వస్తువులు కనిపించలేదు. వెంటనే దువ్వాడ క్రైమ్ పోలీసులకు నానాజీరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ ఢీకొని కారు బోల్తా

కూర్మన్నపాలెం: గాజువాక నుంచి కూర్మన్నపాలెం వైపు బుధవారం వస్తున్న ఓ కారు శ్రీనగర్ బ్రిడ్జికి సమీపంలో డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. కారులో ఉన్న భర్త, భార్య, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారంతా కారు దిగి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లిపోయారు. వారి పూర్తి వివరాలు తెలియలేదు.



శ్రీనగర్ సమీపంలో లోయలో పడిన కారు

ఉక్కు ఆస్పత్రి స్లాట్ విధానంలో మార్పులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న స్లాట్ విధానంలో మార్పులు చేశారు. ఆస్పత్రి వైద్యులు, స్పెషలిస్టుల వద్దకు వెళ్లడానికి ఇప్పటి వరకు స్లాట్ విధానం ఉంది. స్లాట్ దొరకని రోగులు వెనక్కి తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ అంశంపై ఇటీవల ఐఎన్‌టీయూసీ నాయకులు ఆస్పత్రి యాజమాన్యానికి వివరించి స్లాట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన యాజమాన్యం ఆస్పత్రి స్పెషలిస్టులు, వైద్యులు తమ స్లాట్ పూర్తయిన తర్వాత అక్కడ వేచి ఉండే రోగులను పరీక్షించనున్నారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'బీచ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటా యని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.